తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
ఘనంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన ఆయా శాఖల జిల్లా అధికారులు

- జూన్ 2 ఆదివారం ప్రభుత్వ సెలవు రద్దు
- ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలి
- రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 29: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితర అధికారులతో ఈ వేడుకలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి లోబడి వేడుకలు నిర్వహించాలన్నారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కావడంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణ చేయాలన్నారు. సర్పంచ్‌ల పాలన ముగిసినందున ప్రత్యేకాధికారులు పతాకావిష్కరణ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్తు దీపాలతో అలంకరించాలని, ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని సూచించారు. ఆదివారం ఆవిర్భావ దినోత్సవం రావడంతో ఉద్యోగులకు సెలవు రద్దు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేస్తారన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికల సంఘం నియమాలను పాటిస్తూ కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును నమోదు చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి శిక్షణ అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీల ఆస్తులు పరిశీలించిన డీపీవో

వెల్దుర్తిలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

వెల్దుర్తి, మే 29: పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, వాటి నిర్వహణపై తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డీపీవో యాదయ్య అన్నారు. బుధవారం వెల్దుర్తితోపాటు మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లోని వైకుంఠధామాలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, డంపింగ్ యార్డును పరిశీలించారు. వాటి నిర్వహణ, సమస్యలు ఉన్నాయా, అవి ప్రస్తుతం ఏ పరిస్థితుల్లో ఉన్నాయి, చేయాల్సిన మరమ్మతులను ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో విఘ్నేశ్వర్, వెల్దుర్తి పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డిని తెలుసుకున్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

మొక్కలను పరిశీలిస్తున్న డీఎల్పీవో సతీశ్‌కుమార్

చిన్నశంకరంపేట, మే29: నర్సరీ, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను సంరక్షించాలని డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని రుద్రారంలో వైకుంఠధామం, క్రీడాప్రాంగణం, పల్లెప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు వాడిపోతే వెంటనే కొత్తవి నాటాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని, మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆస్తులు, భూముల వివరాలను పంచాయతీ కార్యదర్శి అనురాధను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినా కబ్జాకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దచింతకుంటలో పశుగ్రాసం దగ్ధం

పెద్దచింతకుంట గ్రామంలో దగ్ధమవుతున్న పశుగ్రాసం

నర్సాపూర్, మే29: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో గడ్డివాముకు బుధవారం నిప్పు అంటుకుని పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచింతకుంట గ్రామానికి చెందిన రైతు మంగలి రుక్కులు తన ఇంటి పక్కనున్న ఖాళీ స్థలంలో 200 మోపుల గడ్డితో వాముని ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పు అంటుకున్నదని ఫైరింజన్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా అధికారులు స్పందించకపోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ఎస్సై పుష్పరాజ్‌కు మాజీ సర్పంచ్ శివకుమార్ ఫోన్ చేసి సమాచారం అందించగా ఫైరింజన్ ను పంపించారు. ఫైరింజన్ వచ్చే సరికి గడ్డివాము పూర్తిగా దగ్ధమై, రూ.20 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, మే 29: టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, నాయకులు రాంకిషన్, హీరాలాల్, నసీరుద్దీన్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేందర్, చంద్రయ్య, నర్సింలు సురేశ్, యాదగిరి పాల్గొన్నారు.

బడిబాటకు సన్నద్ధం కావాలి

- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫాంలు సిద్ధం చేయాలి
- కలెక్టర్లతో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశం

మెదక్ మున్సిపాలిటీ, మే 29: బడి బాట కార్యక్రమానికి సన్నద్ధం కావాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు. పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫాంలు సిద్ధం చేయించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ విధివిధానాలపై జిల్లాల కలెక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించే లక్ష్యంతో అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. పాఠ్యపుస్తకాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతుల పురోగతి, నోట్‌బుక్స్ సరఫరా ఎంతవరకు వచ్చిందని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏకరూప దుస్తులు త్వరితగతిన మహిళా సంఘాల ద్వారా కుట్టించి పాఠశాలలు ప్రారంభనాటికి అందించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించడానికి మూడు కేటగిరీల వారీగా విద్యార్థులను గుర్తించాలన్నారు.

మహిళా స్వశక్తి సంఘాల ద్వారా దుస్తులు

జిల్లాలోని మహిళా స్వశక్తి సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లాకు 78,000 లక్ష్యంగా కాగా రోజూ 9,000 దుస్తులు కుట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పురోగతి పనులను క్షేత్రస్థాయిలో జిల్లా పాలన యంత్రాంగం సందర్శించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. వీరికి ఈనెల 31వ తేదీన సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

వ్యాయామం దిన చర్యలో భాగమవ్వాలి

ప్రతిఒక్కరూ వ్యాయామాన్ని దిన చర్యలో భాగంగా చేసుకోవాలని, ఇష్టమైన క్రీడల్లో శిక్షణ తీసుకుని రాష్ట్రస్థాయిలో రాణించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరగాంధీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 1న ప్రారంభమైన సమ్మర్ ఫుట్‌బాల్ అండ్ అథ్లెటిక్స్ వేసవి క్రీడా శిబిరాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఫుట్‌బాల్ క్రీడాకారులతో కరచలనం చేసి పలు సూచనలు చేశారు. జిల్లాలోని మెదక్, చిన్న శంకరంపేట, హవేళీఘనపూర్, రామాయంపేట, వెల్దుర్తి, కొల్చారం మండలాల నుంచి 40 మంది విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతితో కూడిన సౌకర్యాలు కల్పించారు. వీరికి జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి భాగ్యమ్మతో శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

సహకార ఆంజనేయుడికి విశేషపూజలు


లక్ష తమలపాకుల అర్చనలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాధవానంద సరస్వతీ స్వామి

ఆంజనేయ స్వామి దర్శించుకున్న మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, మదన్‌రెడ్డి

- చాకరిమెట్ల ఆంజనేయ స్వామికి మహారుద్రం, లక్ష తమలపాకులతో అర్చన
- పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, మే 29: మండలంలోని చిన్నగొట్టిముక్ల పరిధిలో గల అటవీ ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయ స్వామికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి, చాకరిమెట్ల ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. బుధవారం మహా రుద్రం, లక్ష తమలపాకులతో అర్చన, సహస్ర శ్రీసూక్తం, సహస్ర మన్య సూక్తం, పురుష సూక్తం, సత్యనారాయణ స్వామి వ్రతాన్ని 500 మంది బ్రాహ్మణులతో ప్రత్యేక జరిపించారు. ఈ పూజల్లో అశేషంగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని మాధవానంద సరస్వతీ స్వామి భక్తులకు సూచించారు. రుస్తుంపేట ఆశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకట స్వామితో కలసి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు స్వామివారి లక్ష తమలపాకుల అర్చనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు దేవదత్తుశర్మ, దేవిశర్మ, ప్రభురాజశర్మ, హరిప్రసాద్‌శర్మ, నాయకులు కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాలమణి నరేందర్, ఎంపీటీసీ దశరథ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు షురూ

నర్సాపూర్, మే 29: జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి చేస్తామని ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త టి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నర్సాపూర్ (హెచ్ఈసీ), మెదక్ (ఎంపీసీ) బాలికలు, నర్సాపూర్ (ఎంపీసీ, బీపీసీ, సీఈసీ), కౌడిపల్లి (ఎంపీసీ, బీపీసీ) బాలుర జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు బదిలీ, బోనఫైడ్, మెమో, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఉదయం 11 గంటల లోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 29: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ఖాళీలు గల సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని డీసీవో శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా https://www.tswreis.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్

నర్సాపూర్, మే 29: మున్సిపల్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతతో ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, కాలనీవాసులు వెంకట్రావ్, భిక్షపతి, బాలరాజు, కృష్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

రేగోడు: విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో జావిద్, ఎస్సై రాజయ్య

చిలిపిచెడ్: ఫెర్టిలైజర్ షాపులో విత్తనాల శాంపిల్స్ పరిశీలిస్తున్న ఏవో బాల్‌రెడ్డి, ఎస్సై షేక్ మహబూబ్

నిజాంపేట: కల్వకుంటలో జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రాజ్‌నారాయణ

నర్సాపూర్: జక్కపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం
- ఎరువులు, విత్తనాలు కొని రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి
- విత్తనాల కొనుగోలుపై అవగాహన
- ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ

చిలిపిచెడ్, మే 29: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఈవో బాల్‌రెడ్డి అన్నారు. చిలిపిచెడ్ రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఫెర్టిలైజర్‌ను తనిఖీ చేసి విత్తనాల శాంపిల్స్‌ను ఎస్సై షేక్ మహబూబ్‌తో కలిసి పరిశీలించారు. వారితో ఏఈవో భూపాల్, రమ్య, ఫెర్టిలైజర్ యజమాని శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, మే29: విత్తనాలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు మండలంలోని కాగజ్‌మద్దూర్, జక్కపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రాజేఖర్, ఏఈవోలు దుర్గాప్రసాద్, చంద్రవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేగోడులో

రేగోడు, మే 29: రేగోడు మండలంలోని విత్తనాల దుకాణాలను పరిశీలించి, నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజయ్య, ఏవో జావిద్ డీలర్లను హెచ్చరించారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, మే29: విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు రైతులు తప్పకుండా రసీదులు తీసుకోవాలని ఎస్సై శంకర్ అన్నారు. పట్టణంలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రాల్లో తనిఖీ చేశారు. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో రాజేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని టెంకటి, భూర్గుపల్లి, ఉత్తులూర్, నారాయణపల్లి, కొత్తపేట గ్రామాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయనతోపాటు ఏఈవోలు స్వాతి, మమత, సుభాశ్ తదితరులున్నారు.

డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి

నిజాంపేట, మే 29: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా బలపడాలని ఏవో రాజ్‌నారాయణ అన్నారు. బుధవారం కల్వకుంటలో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయనతో ఏఈవో శ్రీలత, పీఏసీఎస్ సీఈవో గోపాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మే29: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నారాయణ హెచ్చరించారు. బుధవారం చిన్నశంకరంపేట, గవ్వలపల్లి, చౌరస్తాల్లోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్‌తో కలసి తనిఖీ చేశారు.

ఆర్ఆర్ఆర్ భూసేకరణపై రైతులతో సమావేశం

తూప్రాన్, మే 29: మండలంలోని పలు గ్రామాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్ వెళ్లనున్న విషయం తెలిసిందే. భూసేకరణ అంశాలపై ఇస్లాంపూర్ రైతులు, అధికారులతో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులు లేవనెత్తిన అనేక సందేహాలు, ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.

నాణ్యతతో అమ్మ ఆదర్శ పనులు చేపట్టాలి: డీఈవో

అంసాని పల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

కొల్చారం, మే 29: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని కొంగోడు, అంసానిపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలు, నాయిని జలాల్పూర్, పోతిరెడ్డి పల్లి తండా, పోతిరెడ్డిపల్లి, వసూరాం తండాల్లోని ప్రాథమిక పాఠశాలలు, కొల్చారంలో ఉర్దూ పాఠశాలను డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తికావాలని హెచ్ఎంలు, వీవోలకు సూచించారు. వారితో ఉపాధ్యాయులు యాదగిరి, చంద్రశేఖర్, తిరుమలరెడ్డి, అనిల్, నసీరుద్దీన్, సీఆర్‌పీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా మాణిక్ ప్రభు జాతర

పెద్దశంకరంపేట, మే 29: మండలంలోని మక్తలక్ష్మాపూర్‌లో మాణిక్ జాతర బుధవారం ప్రారంభమైంది. బ్రాహ్మణుల మంత్రోచ్చరణలతో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకుని భాజాభజంత్రీలు శివసత్తుల నృత్యాలతో పురవీధుల గుండా ఊరేగించారు. గురువారం బండ్ల ఊరేగింపు, శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను మాజీ సర్పంచ్ కవితా రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్నీ గమనించగలరు.